క్లుప్తంగా

బాలలకు ఉచిత గుండె వైద్య పరీక్షలు



చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్‌): బాలలకు సంబంధించిన గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం మేంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్‌ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహించారు. వసుధ ఫౌండేషన్‌ సహకారంతో విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు కె.విక్రమ్‌ 15 ఏళ్లలోపు వయస్సున్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వసుధ ఫౌండేషన్‌ కన్వీనర్‌ ఇందుకూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్‌): జిల్లాలో నిర్వహిస్తున్న స్వీప్‌ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్‌ కార్యాలయం నుంచి ప్రకాశం చౌక్‌ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం చౌక్‌ వద్ద మానవహారంగా ఏర్పడి నోటుకు ఓటు వద్దే వద్దు అంటూ నినాదాలు చేస్తూ ఓటర్లను చైతన్య పర్చారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ కమిషనర్‌ ఎం.శ్యామల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకుని అందరూ ఓటు హక్కు వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో భీమవరం ఎంపీడీవో, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్‌ఎస్‌ వేణుగోపాల్‌, జిల్లా స్వీప్‌ నోడల్‌ అధికారి జీసీహెచ్‌ ప్రభాకర్‌, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్‌ చెరుకువాడ రంగసాయి, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

నేడు వాహనాల బహిరంగ వేలం

ఆకివీడు: స్థానిక ఎక్సైజ్‌ శాఖ పరిధిలోని వివిధ కేసుల్లో సీజ్‌ చేసిన మూడు వాహనాలకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు సెబ్‌ సీఐ కె.కాత్యాయని మంగళవారం తెలిపారు. అయిభీమవరం రోడ్డులోని సెబ్‌ కార్యాలయ ప్రాగణంలో 2 యాక్టీవాలు, పల్సర్‌ బైక్‌ను భీమవరం అసిస్టెంట్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సూపరింటెండెంట్‌ సమక్షంలో వేలం వేస్తారని తెలిపారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

భీమవరం: పట్టణంలోని బుధవారం మార్కెట్‌ ఏరియా జీఐఎస్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ బుధవారం మార్కెట్‌ ఫీడర్‌, సీఎంఆర్‌ ఫీడర్‌, టెంపుల్‌ ఫీడర్స్‌ మరమ్మతుల నిమిత్తం పలు చోట్ల విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ (ఈఈ) పీర్‌ అహ్మద్‌ ఖాన్‌ తెలిపారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి 1 గంట వరకు బుధవారం మార్కెట్‌ ఏరియా, మెంటే వారి తోట, కళాభవన్‌, శ్రీనివాస్‌ సెంటర్‌, బస్టాండ్‌ ఏరియా, జంక్షన్‌ రోడ్‌ రైతు బజార్‌ ఏరియా, బీఎస్‌ఎన్‌ఎల్‌ ఏరియా విద్యుత్‌ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రారంభోత్సవానికి విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ సిద్ధం

ఉండి: యండగండిలో నిర్మాణం పూర్తయిన 33 కేవీ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ను డీసీసీబీ చైర్మన్‌ పీవీఎల్‌ నర్సింహరాజు చేతుల మీదుగా బుధవారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభిస్తున్నట్లు సర్పంచ్‌ గోగులమండ చినకృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

మహిళా పోలీస్‌ మౌనికకు డాక్టరేట్‌



నరసాపురం రూరల్‌: నరసాపురం మండలం దర్భరేవు గ్రామ సచివాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శి రుస్తుంబాదకు చెందిన వడ్లపాటి మౌనిక పెర్సిస్‌కు డాక్టరేట్‌ లభించింది. బిఎస్సీ, బిఈడీ, ఎంబీఏ తదితర కోర్సులు పూర్తిచేసిన ఆమె గతంలో సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్‌ కళాశాలలో ఎంబీఏ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా పనిచేశారు. సచివాలయంలో పనిచేస్తూ పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా మౌనిక పెర్సిస్‌ మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్‌ సంధ్యా శ్రీదేవి ఆధ్వర్యంలో హ్యూమన్‌ రీసోర్స్‌ మేనేజ్‌మెంట్‌పై పరిశోధన చేశానన్నారు. ఈ పరిశోధన పూర్తి చేయడంలో తన భర్త మీసరపు శ్యాంబాబు ప్రోత్సాహం కూడా ఉందన్నారు. ఈ సందర్భంగా మైనికా పెర్సిస్‌ను దర్భరేవు, సీతారాంపురం సౌత్‌, రుస్తుంబాద గ్రామాల సర్పంచ్‌లు, పెన్మెత్స విజయలక్ష్మి, దొండపాటి వెంకట్‌, బందెల భారతి, ఎంపీడీఓ ఎంవీ రమణారావు, ఎస్సై గురవయ్య, తదితరులు అభినందించారు.

ఆర్బీకేలు రైతు నేస్తాలు

- గ్రామాల్లో ఎరువులు, విత్తనాలు అందజేత
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



శ్రీరామపురంలోని ఆర్‌బీకే కేంద్రం

భీమవరం అర్బన్‌: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖరరెడ్డి రైతులకు రుణ మాఫీ, ఉచిత విద్యుత్‌ ఇచ్చి ఆదుకున్నారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు వ్యవసాయం దండగ, కరెంట్‌ తీగలపై బట్టలు ఆరేసుకోవాలంటూ రైతులను అవమానించారు. వైఎస్సార్‌ సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అడుగడుగునా అండగా నిలుస్తూ వారి సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారు. ప్రధానంగా వారి కోసం తీసుకొచ్చిన రైతు భరోసా కేంద్రాలు గ్రామాల్లో వ్యవసాయ విప్లవాన్ని తీసుకువచ్చాయి. దేశంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయి. ఆర్‌బీకేల ద్వారా సొంత గ్రామంలోనే రైతులకు కావాల్సిన అన్ని రకాల సేవలు అందుతున్నాయి. భీమవరం మండలంలో 25 గ్రామాలకు 12 గ్రామాల్లో ఆర్‌బీకే సెంటర్లు, 13 గ్రామాల్లో ఆక్వా రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 8 వేల 215 ఎకరాలలో వరిని సుమారు 3, 411 మంది రైతులు సాగుచేస్తున్నారు. గత నాలుగేళ్లలో ట్రాక్టర్‌, పవర్‌ ట్రిల్లర్లు స్ప్రేయర్లు రైతులకు పంపిణీ చేశారు.

రైతు భరోసా కేంద్రాల్లో విస్తృత సేవలు

గతంలో రైతులకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రాల్లో ఉండే వ్యవసాయ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు వారి సొంత గ్రామాల్లోనే అనేక రకాల సేవలు పొందుతున్నారు. ఆర్బీకేల్లో భూసార పరీక్షలు నిర్వహించి సాగులో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు రైతులకు సలహాలు ఇస్తుండటం ఎంతో ఉపయోగకరంగా మారింది

2019 నుంచి రైతులకు చేకూరిన లబ్ధి

ఇన్‌పుట్‌ సబ్సిడీ 4,327 మందికి రూ.3.58 కోట్లు, పీఎం కిసాన్‌ రైతు భరోసా 17,248 మందికి రూ.21.28 కోట్లు, పంటల బీమా 2,894 మందికి రూ.4.69 కోట్లు, రైతులకు సంక్షేమ లబ్ధి చేకూరింది.

కియోస్క్‌లతో ఎన్నో ప్రయోజనాలు

ఆర్‌బీకేల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్క్‌ యంత్రాలతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. రైతులకు కావాల్సిన నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు బుక్‌ చేసుకున్న 48 గంటల్లోనే నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయి.

ఎరువులు, విత్తనాల పంపిణీ

ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనిముట్లతో పాటు గ్రూపుగా ఏర్పడిన రైతులకు ట్రాక్టర్లను రాయితపై అందించారు.

ఈ క్రాప్‌ – నమోదు

ప్రతి రైతు సాగు చేసి పంటలకు ఈ క్రాప్‌ నమోదు చేయించుకుంటున్నారు. తద్వారా విపత్తులు, తుపాన్ల కారణంగా పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం పొందే అవకాశం కల్గుతుంది. ఈ–క్రాప్‌ సర్టిఫికేట్‌ ద్వారా రైతులకు బ్యాంకులు పంట రుణాలు అందజేస్తున్నాయి.

తక్కువ ధరకే ఎరువులు, విత్తనాలు



గతంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కోసం ప్రైవేటు షాపులకు వెళ్లి వాళ్లు ఎంతచెబితే అంత ధరకు తీసుకువచ్చేవాళ్లం. మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. గ్రామంలోనే ఆర్‌బీకే సెంటర్‌ ఉండటడంతో బుక్‌ చేసుకున్న 48 గంటల్లోనే ఎరువులు, విత్తనాలు, నాణ్యమైన పురుగు మందులు తక్కువ ధరకు అందుతున్నాయి. రవాణా ఖర్చులు తగ్గుతున్నాయి. రైతుల సంక్షేమ కోసం సీఎం వైఎస్‌ జగన్‌ ఆలోచన అమోఘం.

– చిల్లిముంతల శ్రీనివాస్‌, రైతు, చినఅమిరం

రైతులకు మెరుగైన సేవలు



రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే సేవలపై ఎప్పటిప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లోని ఆర్‌బీకేల ద్వారా అన్నదాతలకు మెరుగైన సేవలందుతున్నాయి. ముఖ్యంగా రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నాం.ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతోంది.

– నిమ్మల శ్రీనివాస్‌, మండల వ్యవసాయాధికారి, భీమవరం మండలం

షాపుల యజమానులు కార్మిక సంక్షేమ నిధి చెల్లించాలి

భీమవరం: భీమవరం అసిస్టెంట్‌ లేబర్‌ ఆఫీస్‌ 2వ సర్కిల్‌ పరిధిలోని ఉండి, కాళ్ల, ఆకివీడు మండలాల్లోని యాజమానులు తమ దుకాణాలు, సంస్థలు, ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికుల సంక్షేమ నిధికి రూ.100 చెల్లించాలని అసిస్టెంట్‌ లేబర్‌ ఆఫీసర్‌ కె శివనాగ మల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఏటా జనవరిలో కార్మిక సంక్షేమ నిధికి యాజమాన్యం రూ.70, కార్మికులు రూ.30 చొప్పున బోర్డు ఖాతాకు చెల్లించాలన్నారు. ఇప్పటి వరకు సంక్షేమ నిధి చెల్లించని యజమానులు తక్షణం స్పందించాలని, లేకుంటే 1987 ఆంధ్రప్రదేశ్‌ కార్మిక సంక్షేమ నిధి చట్టాన్ని అతిక్రమించినట్లు భావిస్తామని శివనాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు.

జగ్జీవన్‌రామ్‌ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి



భీమవరంలో మోషేనురాజుకు వినతిపత్రం అందిస్తున్న ఎంఆర్‌పీఎస్‌ నాయకులు

భీమవరం: భీమవరం పట్టణంలోని అగ్రికల్చర్‌ మార్కెట్‌ వద్ద బాబూజగ్జీవన్‌రామ్‌ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించేందుకు కృషి చేయాలని ఎంఆర్‌పీఎస్‌ నాయకులు శాసన మండలి చైర్మన్‌ కొయ్యే మోషేనురాజు, కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌గాం. దీకి మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్‌ జిల్లా మహిళా అధ్యక్షురాలు చెట్టెం జాన్సీరాణి, మహజన్‌ సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు గరికపూడి జేమ్స్‌రాజు, పలివెల మోసే, కంకట రత్నకుమార్‌, బోకూరి విజయరాజు తదితరులున్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠ పూజలు



చెరుకువాడలో మల్లేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: చెరుకువాడలో పార్వతీసమేత చెన్నమల్లేశ్వరస్వామి, రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్ల ఆలయ పునఃప్రతిష్ఠ పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం సర్పంచ్‌ కొండవేటి సాంబశివరావు(శివయ్య) ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, డీసీసీబీ చైర్మన్‌ పీవీఎల్‌ నర్సింహరాజు సహకారంతో దేవదాయ నిధులు రూ.కోటి, దాతల సహకారంతో రూ.కోటి మొత్తం రూ.2 కోట్లతో రెండు ఆలయాలు అత్యంత సుందరంగా రూపుదిద్దుకున్నాయి. మూడు రోజులు పాటు చెన్నమల్లేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం పది మంది దంపతులు పూజల్లో పాల్గొన్నారు. మూడోరోజు ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్థంభం ప్రతిష్ఠ, శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తామని సర్పంచ్‌ తెలిపారు. ఆరో రోజులపాటు పూజలు, హోమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు, గ్రామ పెద్దలు పెన్మత్స బాబీ, కట్టా నర్సింహమూర్తి, నడింపల్లి కృష్ణంరాజు, సన్నిధి నర్సింహమూర్తి, గ్రామ పెద్దలు, ప్రజలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

చర్చిలో చోరీని ఖండించిన యూపీఏ నాయకులు

ఉండి: మండల కేంద్రం ఉండి శివారు ప్రాంతమైన రామాపురంలోని సీయోను ప్రార్థనా మందిరాన్ని మంగళవారం మండల యునైటెడ్‌ పాస్టర్స్‌ ఫెలోషిప్‌ నాయకులు మంగళవారం సందర్శించారు. ఈ నెల 24వ తేదీ శనివారం చర్చిలో చోరీ ఘటన నేపథ్యంలో వారు చర్చిని పరిశీలించి పాస్టర్‌ కే దానియేలును పరామర్శించారు. ఈ సందర్భంగా యూపీఎఫ్‌ నాయకులు మాట్లాడుతూ చర్చిలో దొంగతనాన్ని యూపీఎఫ్‌ తరపున ఖండిస్తున్నామని అన్నారు. చోరీకి పాల్పడిన వారిని పోలీసులు గుర్తించి తగు చర్యలు తీసుకోవడంతోపాటు చర్చి సొత్తును రికవరీ చేయాలని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు భద్రత కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూపీఎఫ్‌ మండలాధ్యక్షుడు దేవవరదానం, గౌరవాధ్యక్షుడు డాక్టర్‌ ఈలి డేవిడ్‌మార్కు, కోశాధికారి సువర్ణరాజు, నాయకులు బుడితి డేవిడ్‌రాజు, మార్టిన్‌లూథర్‌ పాల్గొన్నారు.

ప్రజా క్షేత్రంలో ఎన్నికలకు సిద్ధమవుదాం

- మేము సిద్ధం, మా బూత్‌ సిద్ధం
- మంగళగిరి సభలో పాల్గొన్న నాయకులు
- డీసీసీబీ చైర్మన్‌ పీవీఎల్‌ నర్సింహరాజు



మంగళగిరిలోని సీకే కన్వెర్షన్స్‌ ఫంక్షన్‌ హాల్లో 'మేము సిద్ధం- మా బూత్‌ సిద్ధం' కార్యక్రమంలో పాల్గొన్న ఉండి నియోజకవర్గ నాయకులు

ఆకివీడు: ప్రజా క్షేత్రంలో ఎన్నికలకు సిద్ధమవుదామని, బూత్‌ కమిటీల నాయకులు సైనికుల్లా పని చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారని డీసీసీబీ చైర్మన్‌ పీవీఎల్‌ నర్సింహరాజు చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే. కన్వర్షన్స్‌ ఫంక్షన్‌ హాల్లో మంగళవారం మేము సిద్ధం, మా బూత్‌ సిద్ధం కార్యక్రమానికి తనతో పాటు భీమవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, నియోజకవర్గంలోని మండల, జేసీఎస్‌, పట్టణ నాయకులు హాజరయ్యారని నర్సింహరాజు చెప్పారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి ఏ విధంగా తీసుకువెళ్లి అందజేశామో అదే విధంగా ఎన్నికల్లో ప్రతి ఓటరును కలుసుకుని ఓటు వేసే విధంగా బూత్‌ కమిటీల ప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని జగన్‌ పిలుపునిచ్చారని చెప్పారు. ఎన్నికల రణరంగంలో బూత్‌ స్థాయి నాయకత్వం ఎంతో కీలకమైనదన్నారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించి, మళ్లీ వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం వస్తే పథకాలన్నీ పొందే అవకాశం ఉంటుందని ప్రజలకు తెలియజేయాలని వివరించారన్నారు. విజయం మన వైపే ఉందని, 175 స్థానాలు గెలిచి తీరుతామని సీఎం స్పష్టం చేసినట్లు నర్సింహరాజు చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకురాలు పిళ్ళంగోళ్ల శ్రీ లక్ష్మి, వైఎస్సార్‌ సీపీ ఆకివీడు, కాళ్ల, ఉండి మండల కమిటీ అధ్యక్షులు అన్యెం కృష్ణ, గణేశ్న రాంబాబు, ఆంజనేయరాజు, నియోజకవర్గ జేసీఎస్‌ కన్వీనర్‌ ధనుంజయ్‌, మండల జేసీఎస్‌ కన్వీనర్లు పుప్పాల పండు, శిరపు శ్రీనివాస్‌, గంగయ్య, రాధాకృష్ణ, రామకృష్ణ, పట్టణ వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు అంబటి రమేష్‌, నియోజకవర్గ పోలింగ్‌ బూత్‌ కన్వీనర్‌ ఎండీ.జహంగీర్‌ పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ బ్రోచర్‌ ఆవిష్కరణ



బ్రోచర్‌ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్‌): మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు శ్రీవిజ్ఞాన వేదిక, ఇన్నర్‌ వీల్‌ క్లబ్‌, పట్టణ మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ బ్రోచర్లను పురపాలక సంఘ కమిషనర్‌ ఎమ్‌ శ్యామల ఆవిష్కరించారు. స్వాతంత్రోద్యమంలో మహిళలు వీరోచిత పాత్ర పోషించారని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలుగా నిర్వహించడం గొప్ప విశేషమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మార్చి 1న డీఎన్‌ఆర్‌ ఇంజనీరింగ్‌ కళాశాలలో ప్రారంభ సభ నిర్వహిస్తామని, 2 నుంచి 5వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలలో మహిళా సాధికారితపై వివిధ పోటీలు నిర్వహిస్తామని 6,7 తేదీల్లో పురపాలక సంఘం, మెప్మా మహిళా సంఘాలతో రంగవల్లుల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఇన్నర్‌ వీల్స్‌ క్లబ్‌ కార్యదర్శి సామంతపూడి మణి, డీఎన్‌ఆర్‌ ఇంజనీరింగ్‌ కళాశాల గ్రంథాలయాధికారిణి కె. శిరీష అలయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ ఇంటర్నేషనల్‌ కార్యదర్శి అల్లు వనజాక్షి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సరోజ మాట్లాడుతూ మహిళా చట్టాలపై అవగాహన ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. 8వ తేదీ విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు, విశేష సేవాతత్పరులైన మహిళలకు సత్కారాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఎస్‌ఆర్‌కేఆర్‌ విద్యార్థులకు ప్రథమ స్థానం



అంతర్జాతీయ సదస్సులో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: ఎనర్జీ మేనేజ్మెంట్‌ సిస్టం ఇన్‌ ఇండస్ట్రియల్‌ అండ్‌ కమర్షియల్‌ ఫెసిలిటీస్‌ అనే అంశంపై తమ కళాశాల విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టు ప్రాజెక్టుకు అంతర్జాతీయ సదస్సులో బహుమతి లభించిందని భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్‌ ఇంజనీరింగ్‌ కళాశాల ప్రిన్సిపల్‌ కెవి మురళీకృష్ణంరాజు చెప్పారు. మంగళవారం కళాశాలలో బహుమతిసాధించిన విద్యార్థులను అభినందించిన సందర్భంగా ఆయన వివరాలను వెల్లడించారు. ఈనెల 23వ తేదీ నుంచి మూడు రోజులపాటు తాడేపల్లిగూడెంలో నిర్వహించిన సదస్సులో తమ కళాశాల ఎలక్ట్రికల్‌ అండ్‌ ఎలక్ట్రానిక్స్‌ ఇంజనీరింగ్‌ విద్యార్థుల బృందం రూపొందించిన ప్రాజెక్టుకు ప్రథమ స్థానం లభించడంతో రూ.10 వేలు నగదు బహుమతినందుకున్నారన్నారు. కళాశాల టెక్నాలజీ సెంటర్‌ హెడ్‌ ఎన్‌.గోపాలకృష్ణమూర్తి, ప్రాజెక్ట్‌ మెంటర్‌ కురెళ్ళ పవన్‌కుమార్‌ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సదస్సుకు సుమారు 1,000 ప్రాజెక్టులు పరిశీలనకు రాగా తమ కళాశాల విద్యార్థులు దీపిక, కె సిరిచాతుర్య, డి.జైదురా, పి.జేమ్స్‌, ఏఈవీ సాయి, వి.కుసుమరేణుక, యు.సత్యసాయి రూపొందించిన ప్రాజెక్టు బహుమతి దక్కించుకుందన్నారు. అనంతరం విద్యార్థులను కళాశాల డైరెక్టర్‌ ఎం జగపతిరాజు, ప్రిన్సిపాల్‌ మురళీకృష్ణంరాజు తదితరులు అభినందించారు.

వరి పైరులో జింకు ధాతు లోపం



గొరగనమూడిలో రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయ అధికారి నారాయణరావు

పాలకోడేరు: మండలంలోనీ ఈ రబీ సీజన్‌లో రైతులు 11,440 ఎకరాల్లో వరి నాట్లు వేయగా అక్కడక్కడ వరి నాట్లు ఆలస్యంగా వేయడం వల్ల జింక్‌ ధాతు లోపం అధికంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి వి నారాయణరావు తెలిపారు. మండలంలోని పెన్నాడ, గొరగనమూడి, శృంగవృక్షంలో ఈ సమస్య అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు రైతులు ప్రతి ఎకరానికి 200 గ్రాములు చిలామిన్‌ లేదా 200 గ్రాముల మహా జింక్‌ వరి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. సల్ఫైడ్‌ లోపం నివారణకు చేలను సాధ్యమైనంత వరకు ఎండగట్టడం వల్ల ఈ సమస్యను అధిగమించవచ్చునన్నారు. పండుటాకు తెగులు ఉన్న పంటపై కాపర్‌ ఆక్సైడ్‌ పిచికారీ చేయాలన్నారు. రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి గ్రామ సచివాలయాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని తెలిపారు.

వలంటీర్ల సేవలు అమోఘం



సేవా వజ్రకు ఎంపికైన వలంటీర్‌ బెంజిమెన్‌ను సత్కరిస్తున్న సర్పంచ్‌ సుబ్బరాజు

కాళ్ల: వలంటీర్లు అమోఘమైన సేవలందిస్తున్నారని వారి కృషిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌ రెడ్డి గుర్తించి అవార్డులు ప్రదానం చేసి ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయమని మాలవానితిప్ప సర్పంచ్‌ సాగిరాజు సుబ్బరాజు తెలిపారు. మాలవాని తిప్ప నుంచి వలంటీర్‌గా సేవలందించి సేవ వజ్ర అవార్డుకు ఎంపికైన పి బెంజిమెన్‌కు సత్కార కార్యక్రమం మంగళవారం గ్రామంలో నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్‌ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామాల్లో ప్రజలకు సేవ చేసే భాగ్యం యువతకు కల్పించారని స్పష్టం చేశారు. మండలంలో మాలవానితిప్ప గ్రామం నుంచి సేవా వజ్రా అవార్డుకు ఎంపికైన పి బెంజిమెన్‌ను ఈ సందర్భంగా సర్పంచ్‌ సుబ్బరాజు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ వలంటీర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహంతో పాటు సర్పంచ్‌ సుబ్బరాజు తమకు ప్రతినెల రూ.500 నగదు ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎన్‌ రాజు, సచివాలయ కార్యదర్శి ఈ.సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామ నామస్మరణతో మార్మోగిన ఆనందపురం



కోదండ రాముని ఆలయ ప్రాంగణంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కాళ్ల: శ్రీరామ నామస్మరణతో ఆనందపురం గ్రామం మార్మోగింది. కోదండ రామాలయం ప్రతిష్ఠ, అభయాంజనేయ స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కాళ్ల మండలం శివారు ఆనందపురంలో భక్తులు, దాతలు, గ్రామప్రజలు సహాయసహకారాలతో నూతనంగా నిర్మించిన కోదండరామాలయం ఆలయ ప్రాంగణంలో మంగళవారం ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. బుధవారం 7.35 గంటలకు వేదమంత్రాల నడుమ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ, ఉదయం 10.02 గంటలకు అభయాంజనేయ స్వామి విగ్రహావిష్కరణ నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్దరాజు శ్రీనివాసరాజు, ముదునూరి సాయిరాజు, బండారు దుర్గారావు, కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామపెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా వైఎన్‌ కళాశాల వార్షికోత్సవం

నరసాపురం: స్థానిక వైఎస్‌ కళాశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల సెక్రటరీ అండ్‌ కరస్పాండెంట్‌ డాక్టర్‌ చినిమిల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సభకు ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ కనకారావు అధ్యక్షత వహించగా, కోశాధికారి పోలిశెట్టి రఘురామ్‌, జీబీ మెంబర్లు చేగొండి సూర్యనారాయణ, సీహెచ్‌ రెడ్డప్పధవేజీ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షిక వేడుకలు

పాలకొల్లు అర్బన్‌: మండలంలోని తిల్లపూడి గ్రామదేవత తిళ్లపాయిలమ్మ, మారెమ్మ అమ్మవార్ల ఆయల మూడో వార్షిక వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాతలు కామిశెట్టి రంగారావు, సీతామహాలక్ష్మి, స్వామి అయ్యప్పనాయుడు, నాగదేవి, సత్యనారాయణ, లక్ష్మి దంపతులచే ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ ర్యాలి శివరామకృష్ణ ప్రసాద్‌ (సిద్ధాంతి) బ్రహ్మత్వంలో 12 మంది అర్చకులు ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు చేశారు. హోమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటుచేశారు. గ్రామ సర్పంచ్‌ నడపన శ్రీనివాసరావు, సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు నడపన చినసత్యనారాయణ, ఎంపీటీసీ నడపన నరసింహస్వామి, నడపన పురుషోత్తం (బాబ్జి), నడపన జగపతి, నడపన చల్లాలు, నడపన కృష్ణమూర్తి (సీఎం) తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్బీచర్లలో పార్వతీ సోమేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠ

నరసాపురం రూరల్‌: మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో పునర్నిర్మించిన పురాతన శ్రీపార్వతీ సోమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఉదయం 10.03 గంటలకు పార్వతీ సోమేశ్వరస్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటుచేసినట్టు ఆలయ కమిటీ పేర్కొంది. కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్‌ ముదునూరి ప్రసాదరాజు, పలువురు రాజకీయ నేతలు, ప్రముఖులు హాజరవుతున్నట్టు తెలిపారు. ఈ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం బ్రహ్మశ్రీ కాళ్లకూరి దుర్గా ప్రసాద్‌శర్మ, మంచిలి పురుషోత్తమశర్మ నేతృత్వంలో పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వాహణాధికారి పులగం వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

దుస్తుల పంపిణీ

పాలకొల్లు అర్బన్‌: పేద విద్యార్థులు చదువులు ఆగిపోకూడదని లక్ష్యంతో కోట్ల విలువైన ఆస్తులను ట్రస్ట్‌కు కేటాయించిన మహనీయురాలు మన్యం జగ్గమ్మగారని ఆ సత్రం చైర్మన్‌ నంబూరి శ్రీగంగా పవన్‌కుమార్‌ అన్నారు. స్థానిక శ్రీ మన్యం జగ్గమ్మగారి జ్ఞాపకార్థం సత్రం కార్యాలయ ఆవరణలో మంగళవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. బ్రాహ్మణులకు పంచి, కండువాలు అందజేశారు. ట్రస్టుబోర్డు సభ్యులు మెంట వెంకట సత్యనారాయణ, దాసరి సత్యనారాయణ, అమలాపురపు బాలసుబ్రహ్మణ్యేశ్వరి పాల్గొన్నారు.

బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా
Bank of Baroda
వన్‌టౌన్‌ భీమవరం బ్రాంచ్‌, డి.నెం.23-2-36, త్యాగరాజ భవన్‌ వీధి, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా - 534201

లాకర్స్‌ ప్రకటన

లాకర్‌ నెం.	పేరు మరియు చిరునామా
7537GXIDD4 -D30	శ్రీ వెంకట సత్యనారాయణ [illegible]

పైన పేర్కొన్న ఖాతాదారులు మా బ్రాంచ్‌ నందు తేది.24.08.2011న లాకర్‌ సౌకర్యం పొందియున్నారు. [illegible] తేది.08.01.2021 నుండి [illegible] రూ.41,828.45/- [illegible]

తేది.28.02.2024 సం/- చీఫ్‌ మేనేజర్‌